క్లుప్తంగా

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి



ఉపాధ్యాయుడు కన్నయ్య (ఫైల్)

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.కన్న య్య (50) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఉపాధ్యాయుడిని కుటుంబ సభ్యులు ఫిబ్రవరి 27న విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయనకు భార్య దేముడమ్మ, కుమారులు సింహా చలం, శ్రీనివాస్‌గౌతమ్, కుమార్తె కృష్ణవేణి ఉన్నారు. ఉపాధ్యాయుడి మృతికి ఆ పాఠశాల, మండల ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థినులతో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు గరివిడి కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) ఎస్ఓ ఈ.ధనలక్ష్మికి సూచించారు. గరివిడి కేజీబీవీని మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాల తరగతి గదులు, వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థినులతో ఆయన మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. శ్రద్ధగా చదువుకోవాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేసవి సెలవుల్లో ఇళ్ల వద్ద మొబైల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా చదువుకోవాలని, సోషల్ మీడియా, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని చెప్పారు.


చెక్‌పోస్టు వద్ద కొనసాగుతున్న ఆందోళన



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, రైతులు

వేపాడ: మండలంలోని బొద్దాం చెక్ పోస్టువద్ద అక్రమ వసూళ్లను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మూడోరోజు మంగళవారం రైతులు, ట్రాక్టర్ల డ్రైవర్లు ఆందోళన కొనసాగించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు చల్లా జగన్ మాట్లాడుతూ రైతులు తమ మెరకపొలాల్లోని మట్టిని పల్లపు పొలాలకు తరలించినా, ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన మట్టిని తమ పొలాల నుంచి తరలించినా చెక్ పోస్టు వద్ద డబ్బులు వసూళ్లు చేయడం దారుణమన్నారు. మైనింగ్ అధికారుల సహకారంతోనే చెక్‌పోస్టు సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సంబంధిత జిల్లా అధికారులు,పాలకులు స్పం దించి టోల్‌గేట్ ఎత్తియాలని, లేదంటే ట్రాక్టర్లలో మట్టి, పిక్క తరలింపులకు వసూళ్లు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.సీఐటీయూ నాయకులు, ట్రాక్టర్ల డ్రైవర్లు, రైతులు గేదెల శ్రీను, టి.సతీష్, పి.కృష్ణ, డాన్ శ్రీను, గొర్లె గణేష్, అలమండ శివప్రసాద్,సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వడగళ్ల వాన



వేపాడలో కురుస్తున్న వర్షం

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వడగళ్ల వర్షం కురిసింది.ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండడంతో కాస్త ఉక్కపోత పెట్టింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వడగళ్లతో వర్షం కురవ డంతో ప్రజలు ఉపశమనం పొందారు.

పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని ఐసీడీఎస్ పీఓ డి.ఉమాభారతి సూచించారు నవచై తన్యం, ఆదర్శశిల, పోషణ బి, పడా యిబీ కార్యక్రమాలపై రామవరం ఉన్నత పాఠశాలలో గంట్యాడ మండలానికి చెందిన 96 మంది, బొండప ల్లి మండలానికి చెంది 29 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఆరేళ్ల లోపు పిల్లలకు మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం, క్రియాశీలక, భాషా నైపుణ్యం కలిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో పశువైద్యశాల

- శిథిలావస్థలో ఏరియా పశువైద్యశాల భవనాలు
- రెండు భవనాల్లోనూ పెచ్చులూడుతున్న శ్లాబు
- కనీస సౌకర్యాలు కరువు
- పశువులకు తాగునీటి కుండీలు లేవు
- పూర్తిస్థాయిలో లభించని మందులు



గుర్ల ఏరియా పశువైద్య కేంద్రం



పాడైన కిటికీలు





ఆస్పత్రి భవనాల్లో పెచ్చులూడిన శ్లాబు

గుర్ల: స్థానిక ఏరియా పశువైద్య శాలలో సమస్యలు తిష్టేశాయి. 2014 నుంచి 2019 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇక్కడ పశువైద్య శాలకు ఏరియా ఆస్పత్రిగా స్థాయి పెంచారు. అయితే అప్పటి ప్రభుత్వం ఆస్పత్రికి స్థాయి పెంచడంతోనే సరిపెట్టిందే తప్ప కనీస సదుపాయాలు కల్పించలే దు. ప్రస్తుతం పేరు గొప్ప..ఊరు దిబ్బ అన్నచందంగా తయారైంది ఇక్కడి ఆస్పత్రి పరిస్థితి. అయిదు దశాబ్దాల క్రితం నిర్మించిన రెండు భవనాల్లోనే సిబ్బంది సేవలందిస్తున్నారు. ఈభవనాలు పూర్తిగా శిథిలావ స్థకు చేరుకోవడంతో శ్లాబులు పెచ్చులూడి పడుతున్నాయి. భవనాలు ఏక్షణాన కూలిపో తాయోనన్న భయాందోళన మధ్యే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిం చాల్సి వస్తోంది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. చిన్నపాటి వర్షానికి సైతం శ్లాబు నుంచి నీరు కారుతుండడంతో మందులు తడిసిపోతు న్నాయి. సిబ్బంది ఉండే భవనాలతో పాటు పశువుల షెడ్ కూడా శిథిలావస్థకు చేరుకుంది.ఈ ఆస్పత్రికి గుర్ల ,గరివిడి మండలాల నుంచి రోజూ సుమారు వంద వరకు పశువులు, మూగజీవాలను పాడిరైతులు, పెంపకందారులు చికిత్స కోసం తీసుకువస్తుంటారు. గరివిడి వెంకటేశ్వర వెటర్నరీ కళాశాల నుంచి విద్యార్థులు కూడా ఇక్కడికి శిక్షణ కోసం వస్తుంటారు. ఆస్పత్రిలో మరుగుదొడ్లు లేకపోవడంతో సిబ్బందితో పాటు పాడిరైతులు, శిక్షణకు వచ్చే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పశువుల కోసం కనీసం తాగునీటి కుండీలు కూడా నిర్మించలేదు. పూర్తిస్థాయిలో మందులు కూడా అందుబాటులో లేకపోవడంతో పాడిరైతులు ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది.

ప్రతిపాదనలు పంపించాం



ఏరియా పశు వైద్యకేంద్రం భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాలు మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిప్రాదనలు పంపించాం. మందుల కొరత లేదు. కొన్ని హైపవర్ వ్యాక్సిన్‌లు లేవు. వాటిని మాత్రమే ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసుకోవాలని పాడిరైతులకు సిఫార్సు చేస్తున్నాం.

– టి.రమణాచలం, పశుసంవర్ధక శాఖ ఏడీ, గుర్ల

వైభవంగా కోటమ్మ పండగ



శృంగవరపుకోట: కొట్టాం పూజారితో కలిసి కోటమ్మ ఆలయానికి వెళుతున్న భక్తులు



శృంగవరపుకోట: కొట్టాంలో ఆకట్టుకున్న బండ్లవేషాలు



బొండపల్లి: గొల్లుపాలెంలో కోటమ్మ తల్లి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామంలో కోటమ్మ తల్లి పండగను దేవదాయశాఖ పర్యవేక్షణలో మంగళవారం వైభవంగా నిర్వహించారు.పండగకు చుట్టు పక్క గ్రామాలు, మండలాలు, జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యా రు.సాయంత్రం అమ్మవారి గద్దె ఇంటి నుంచి ఘటాలను డప్పుల మోతతో ఊరేగించారు. భక్తులు అమ్మవారి ఘటాల్లో నైవేద్యాలు వేశారు. ఆలయ పూజారిని భాజాభజంత్రీలు, కాగడాల వెలుతురులో అమ్మవారి గద్దె ఇంటి నుంచి గ్రామంలో అన్ని వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామస్తులు అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. ఈసందర్భం గా ఏర్పాటు చేసిన బండ్ల వేషాలు, నేల డ్యాన్స్‌లు, దేవతామూర్తుల వేషాలు ఆకట్టుకున్నాయి.

గొల్లుపాలెంలో...

బొండపల్లి: గొల్లుపాలెం గ్రామంలో కోటమ్మ తల్లి పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఘటాలు, ప్రభలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు.

దళితులను విడదీయడం అన్యాయం



మాట్లాడుతున్న మాలమహానాడు సంఘం ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): దళితులను విడదీసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, దళితులను విడదీయాలనుకోవడం అన్యాయమని గరివిడి మండల మాలమహానా డు సంఘం అధ్యక్షుడు, కాపు శంబాం ఎంపీటీసీ సభ్యుడు టొంపల సంజీవరావు అన్నారు. గరివిడిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయ మాట్లాడుతూ 2004వ సంవ త్సరం, 2005లో ఎస్సీల వర్గీకరణ చెల్లదని, దళితులను విడదీసే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్రప్రభుత్వాలు చేసుకోవచ్చని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని, ఇదే అదునుగాకూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు తెరతీసిందని అన్నారు. ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. వర్గీకరణ అంశంలో సమన్యాయం చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన చేయాలని కోరారు. మాలమహానాడు సంఘం ప్రతినిధులు బి.సూర్యనారాయణ,బి.పోలీస్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో తనిఖీలు



కోనూరు పీహెచ్‌సీలో వ్యాక్సిన్‌లను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు,గరివిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీలు) జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్ఓ) డాక్టర్ జీవనరాణి మంగళవారం తనిఖీలు నిర్వహించారు.ఆస్పత్రుల్లోని అన్ని విభాగాలను, ల్యాబ్‌లను, మందుల నిల్వలను, వైద్య సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. రోజుకు ఎంత ఓపీ నమోదవుతోందని, ఎలాంటి ఆరోగ్య సమస్యలపై ఎక్కువగా రోగులు ఆస్పత్రులకు వస్తున్నారని అక్కడి వైద్యాధికారులను ఆరా తీశారు. సక్రమంగా వైద్యసేవలందించాలని, ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. అన్ని రకాల మందులు, వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఆర్‌సీహెచ్, ఏబీహెచ్‌ఏ, గర్భిణుల వివరాల రిజిస్ట్రేషన్ శతశాతం చేయించాలని ఆదేశించారు. డీఎంహెచ్ఓ వెంట గరివిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రాజ్యలక్ష్మి, సీహెచ్ఓ ఎన్.సత్యంనాయుడు, కోనూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు సీహెచ్.రమణమ్మ, పి.విష్ణుబాలాజీ, ఎంపీహెచ్ఈఓ ఎన్.అప్పలనాయుడు, సీహెచ్ఓ చంద్రశేఖర్‌రాజు ఉన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను పక్కాగా నిర్వహించాలి



గజపతినగరం : శిక్షణకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్లు



శృంగవరపుకోట: శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ సోమేశ్వరరావు, అధికారులు

శృంగవరపుకోట: ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు)లను పక్కాగా నిర్వహించాలని ఎంపీపీ సోమేశ్వరరావు అన్నారు. పట్టణంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద గ్రీన్ అంబాసిడర్లు, పారిశుద్ధ్య కార్మికులకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్లనుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి, మిగతా చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలని సూచించారు.పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఎంపీడీఓ సతీష్, ఈఓపీఆర్డీ లక్ష్మి, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, పంచాయతీ ఈఓ అనూరాధ, వార్డు మెంబర్ కె.భారతి తదితరులతో కలిసి కేంద్రం ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. ఎస్.కోట పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీఓ కల్యాణి అన్నారు.చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్వహణపై మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీలో గ్రీన్ అంబా సిడర్లు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు.గ్రామాల్లో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త సేకరణ, దాన్ని ఎస్‌డబ్ల్యూపీ సీలకు తరలించడం,సేంద్రియ, వర్మీ కంపోస్టు తయారు చేసే విధానాలను వివరించారు. ఈఓపీఆర్డీ జనార్దనరావు,రిసోర్స్ పర్సన్ సుమ, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో 2024–2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్‌పై డీఆర్పీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. అధికారులు ఆడిట్ నివేదికలపై చర్చిస్తున్న క్రమంలో స్థానిక టీడీపీ,వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో డీఆర్పీ రాజ్‌కుమార్ కార్యక్రమాన్ని నిలిపివేశారు.ఈ నెల 29న మండలస్థాయిలో నిర్వహించనున్న ప్రజావేదికలో నివేదికలు సమర్పించాలని సిబ్బందికి సూచించారు.

డీటీ వరప్రసాద్‌కు బదిలీ

దత్తిరాజేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న వరప్రసాద్‌కు రేగిడి ఆమదాలవలస బదిలీ అయిందని తహసీల్దార్ విజయభాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక్కడికి రేగిడి ఆమదాలవలస నుంచి ఎన్.చిన్నారావు బదిలీపై రానున్నట్లు పేర్కొన్నారు. అయితే డీటీ బదిలీ వెనుక అధికారపార్టీ నాయకుల ఒత్తిడి ఉందనే చర్చ స్థానికంగా జరుగుతోంది.

ఆశీల వేలం పాట వాయిదా

గజపతినగరం: మండల కేంద్రంలో పంచాయతీ పరిధిలోని రోజువారీ మార్కెట్‌లో ఆశీలు వసూళ్లకు పంచాయతీ ఈఓ జనార్దనరావు ఆధ్వర్యంలో మంగళవారం వేలం పాట వేశారు. వేలం పాటకు ఒక్కరే రావడంతో గురువారం నాటికి వాయిదా వేస్తున్నామని పంచాయతీ ఈఓ ప్రకటించారు. పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

దత్తిరాజేరు: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవా లని పంచాయతీ కార్యదర్శులకులకు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పలువురు పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రస్తుతం సమ్మర్ క్రాష్ ప్రోగ్రాం జరుగుతోందని, ఇప్పటికే ఈ కార్యక్రమం పూర్తయిన గ్రామాల్లో మళ్లీ బోర్లు పాడైతే తెలియజేయాలని సూచించారు.

శిక్షణతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

విజయనగరం అర్బన్: నర్సింగ్ విద్య కోర్సులతో పాటు జర్మన్ భాషపై అందించిన ఉచిత శిక్షణను ఉద్యోగ, ఉపాధి అవకాశానికి సద్వినియోగం చేసుకోవాలని స్కిల్బీ సంస్థ ప్రతినిధి ఉజ్వల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మహరాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (మిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్) బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సుల విద్యార్థులకు జరిగిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో ఎనిమిది నెలల శిక్షణ అనంతరం జర్మనీలో రూ.2.5 లక్షల నుంచి రూ.3.5 లక్షల జీతంతో కల్పిస్తున్న ఉద్యోగాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా జర్మనీ దేశ ప్రతినిధి విక్టోరియా మాట్లాడుతూ వీసా, ప్రమాణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని ఉద్యోగాలు చేయాలనుకున్న వారికి వసతి, ఆరోగ్య బీమా, పింఛన్ సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. అనంతరం జర్మనీ దేశ ప్రతినిధి విక్టోరియాను ఘనంగా సత్కరించారు. మిమ్స్ డైరెక్టర్ టి.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: ఉపాధి హామీ పథకంలో అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు.మండలంలో 2024–2025 ఆర్థిక సంవ త్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్‌పై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏపీడీ రమామణి ఆధ్వ ర్యంలో మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పించాలని సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వివాదాలు లేకుండా చూడాలన్నారు.

మస్టర్లలో దిద్దుబాట్లు

పెదమజ్జిపాలెం, బుడతానపల్లి, చినమానపురం, కొండతామరపల్లి, రావివలస, బోనంగి, వసాది, నీలావతి, జగ్గాపురం గ్రామాల్లో వేతనదారుల మస్టర్ల సీట్లలో దిద్దుబాట్లును, వేతనదారుల సంతకాలు లేకపోవడాన్ని సోషల్ ఆడిట్ బృందం గుర్తించింది. ఇకపై ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఉపాధి హామీ అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు.విజిలెన్స్ అధికారి భానోజీరావు, స్టేట్ రిసోర్స్ పర్సన్ మన్మధరావు, ఎంపీడీఓ భానోజీరావు, ఏపీఓ సుందరరావు, పీరుబండి జైహింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోండి



బొద్దాంలో పిల్లలకు ఈకేవైసీ చేస్తున్న రేషన్ డీలర్

వేపాడ: ఇదివరకు ఈకేవైసీ చేయించుకోని రేషన్ లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని సీఎస్‌డీటీ రామకృష్ణ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 3,495 మంది రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని చెప్పారు. డిపోల వారీగా జాబితాలను డీలర్లకు అందజేశామన్నారు. ఆరేళ్ల లోపు పిల్లలకు ఈకేవైసీ చేయించడంలో కొంతజాప్యమవుతోందన్నారు. 3,495 మందిలో ఇప్పటివరకు 92 మందికి మాత్రతే ఈకేవైసీ పూర్తయిందని వివరించారు. ఈకేవైసీ పూర్తి కాని వారు తమ డీలర్ల వద్ద కానీ సచివాలయాల్లో లేదా మీసేవా కేంద్రాల్లో ఈ నెలాఖరులోగా చేయించుకోవాలని సూచించారు.

అక్రమ కలప వ్యాపారానికి అడ్డా



ఎస్.కోట - పి.కె.పల్లి రోడ్డులో ఎడ్ల బళ్లపై తరలిపోతున్న టేకు కలప



నెంబర్ ప్లేట్ లేని వాహనంలో విశాఖ- అరకు రోడ్డులో తరలిపోతున్న టేకు దుంగలు

శృంగవరపుకోట: అక్రమ కలప వ్యాపారానికి ఎస్.కోట అడ్డాగా మారింది. పట్టణంలో పలుచోట్ల అక్రమ టేకు కలప నిల్వలు ఉన్నాయి. కలప అక్రమ రవాణా, వ్యాపారాన్ని అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు మొద్దునిద్రలో ఉన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అది పొరుగు జిల్లా కలప మనది కాదుగా అంటూ సంబంధిత అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఎస్.కోట మండల పరిధిలో నిత్యం పదుల సంఖ్యలో కలప బళ్లు కదులుతూనే ఉన్నాయి. పట్టపగలే ధైర్యంగా నాటుబళ్లు, మినీ వ్యాన్లలో కలప కదిలిపోతూనే ఉంది. కళ్ల ముందే టేకు కలప రవాణా అయిపోతున్నా అటవీ శాఖాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.రైతులు తమ సొంత పొలాల్లోని టేకు కలపను నరకాలన్నా రెవెన్యూ శాఖ అనుమతులు తప్పనిసరి. అయితే ఎక్కడా, ఎవరూ అనుమతులు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఎస్.కోట పరిసర సామిల్లుల నిర్వాహకులు టేకు కర్రలను కోతలు వేసి విక్రయాలు చేస్తూ, విశాఖ, ఒడిశా తదితర ప్రాంతాలకు నడుపుతున్నారు.

ఎక్కడా కలప విక్రయాలు, అమ్మకం, కోతలకు సంబంధించి సరైన రికార్డులు లేవు. రికార్డుల్లో వంద రూపాయలు చూపి, బయట వెయ్యి రూపాయల వ్యాపారం చేస్తున్నారు. కలప వ్యాపారం అక్రమం కాకున్నా ప్రభుత్వ ఖజానాకు గండికొట్టి సాగుతున్న వ్యాపారానికి అటవీశాఖ అధికారులు కొమ్ము కాస్తూ నెలవారీ మామూళ్ల మత్తులో జోగుతున్నారు. పట్టణంలో ప్రధాన రహదారిలోనూ, పెదఖండేపల్లి– ఎస్.కోట రోడ్డులో నిత్యం కలప రవాణా అవుతునే ఉంది. ఈ అక్రమ కలప వ్యాపారాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే, సిండికేట్ సీరియస్ అవుతోంది. ప్రశ్నించే వారికి వార్నింగ్‌లు ఇస్తోంది. ఈదందాను అడ్డుకోవాల్సిన అటవీశాఖ ఇప్పటికైనా కళ్లు తెరవాలని, అక్రమంగా సాగుతున్న కలప వ్యాపారాన్ని సక్రమం చేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని స్థానికులు అంటున్నారు.

పాలకుల నిర్లక్ష్యం... జిల్లాకు శాపం

విజయనగరం గంటస్తంభం: పాలకుల నిర్లక్ష్యం విజయనగరం సమగ్రాభివృద్ధికి శాపంగా మారిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. స్థానిక ఎల్‌బీజీ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యల నిలయం, కళల కాణాచి.. పచ్చని పంటల సమాహారానికి జిల్లా పేరుగాంచిందన్నారు. విజయనగరం జిల్లా అంటే వెనుకబడిన జిల్లాగానే పేరుగాంచిందన్నారు. పాలకులు జిల్లా ప్రజలకు ఉపాధి కల్పించి ఉన్న ఊరును, కన్నతల్లిని వదిలిపోయే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. చదువుకున్న వారిని ఉపాధి చూపించాలన్నారు. జిల్లాలో జ్యూట్ పరిశ్రమ, పంచదార పరిశ్రమ, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. కార్పొరేట్ కంపెనీల రాకతో పట్టణంలో చిన్న దుకాణాలు మూతపడే పరిస్థితి దాపురించిందన్నారు. సాంస్కృతిక విశ్వవిద్యాలయం కట్టాలనే ప్రజల ఆకాంక్ష నేటికీ నెరవేరలేదన్నారు. గురజాడ అడిటోరియానికి రూ. 5కోట్లు కేటాయించినా నేటికీ నిర్మించలేదన్నారు. నిర్మాణంలో ఉన్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఎప్పటికి ప్రారంభమవుతుందో, ఎంత మందికి ఉపాధి కల్పిస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సమగ్రాభివృద్ధికి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించి అభివృద్ధి చేయాలని రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. పట్టణ పౌరుల సంక్షేమ సంఘంగా ఏప్రిల్ 5 న జరగనున్న సెమినార్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు రంభ శ్రీనివాసరావు, సంఘం నాయకులు పాల్గొన్నారు.